క్లుప్తంగా

మారెమ్మ తల్లి బోనాల జాతర



తెనాలి: స్థానిక యడ్ల లింగయ్యకాలనీలో వేంచేసివున్న మారెమ్మ తల్లి బోనాల జాతర బుధవారం నిర్వహించారు. అమ్మవారికి శాకంబరి అలంకారం చేశారు. భక్తుల సహకారంతో 500 మందికి అన్నదానం చేశారు. వరుసగా అయిదో ఏట చేసిన జాతరను పల్లపోతుల నాంచారయ్య ప్రథమ పూజారి గురుభవాని, టి.మోసు ఆధ్వర్యంలో నిర్వహించారు.

నిర్ణయం లఘుచిత్రం విడుదల



తెనాలి: పట్టణానికి చెందిన స్వరలయ ప్రొడక్షన్స్ నిర్మించిన నూతన లఘుచిత్రం ‘నిర్ణయం’ను బుధవారం స్వరలయ వేదిక కార్యాలయంలో ‘స్వరలయ స్టూడియోస్’ యూట్యూబ్ ఛానల్‌లో విడుదల చేశారు. వేదిక వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు కథ, మాటలు, దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని ఆయన చెప్పారు. ప్రధాన పాత్రల్లో హేమంత్, వెంకీ, హరి, సుశీల, విజయలక్ష్మి నటించారు. వృద్ధాప్యంలో ఓ తండ్రి తీసుకునే నిర్ణయమే ఇతివృత్తంగా చెప్పారు. అనంతరం ‘సూర్యప్రతాప్’ టైటిల్‌తో ఓటీటీ కోసం సినిమాకు సన్నాహాలు చేస్తున్నామని, సినిమా నటులు, ఔత్సాహికులు నటిస్తారని వివరించారు. ఈ సందర్భంగా నటులు హేమంత్, వెంకీని జ్ఞాపిక, శాలువతో సత్కరించారు.

జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాల పంపిణీ



తెనాలిఅర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం మారీసుపేటలోని 24వ వార్డు సచివాలయంలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డు, కార్డుల విభజన, ఇన్‌కం, క్యాస్ట్, బర్త్, డెత్, వివాహ ధ్రువీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వంటి వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పెదలంక లక్ష్మిలావణ్య, సచివాలయ అడ్మిన్ అబ్దులా తదితరులు పాల్గొన్నారు.

అభా కార్డులు వెంటనే పంపిణీ చేయండి

జిల్లా టీబీ అధికారి డాక్టర్ సుబ్బారావు



తెనాలిఅర్బన్: టీబీ వ్యాధిగ్రస్తులందరికి తప్పని సరిగా అయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను వెంటనే పంపిణీ చేయాలని జిల్లా టీబీ అధికారి డాక్టర్ బి సుబ్బారావు ఆదేశించారు. తెనాలిలోని టీబీ యూనిట్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. టెస్ట్‌ల వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఎస్ఎంవో డాక్టర్ బి లక్ష్మినాయక్, తెనాలి టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె రాధిక, సూపర్‌వైజర్ పి రవికుమార్, లక్ష్మి తదితరులున్నారు.

బైక్ రికవరీ పేరిట మోసం

తెనాలిరూరల్: ఫైనాన్స్ కింద బైక్‌ను కొనుగోలు చేసిన వ్యక్తి ఈఎంఐ చెల్లించని కారణంగా రికవరీ పేరిట వాహనాన్ని తీసుకెళ్లి మోసం చేసిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు తెనాలికి చెందిన పొన్నపల్లి శివ పూర్ణచంద్రరావు 2021లో ఫైనాన్స్‌లో బైక్ కొనుగోలు చేశారు. 2022 జూన్, జులై నెలల్లో ఈఎంఐ బకాయి ఉంది. ఇటీవల గుంటూరుకు చెందిన యువకుడు షేక్ ఆషిక్ తాను రికవరీ ఏజెంట్‌నని చెప్పి తెనాలి వచ్చి వాహనాన్ని తీసుకెళ్లాడు. ఫైనాన్స్ సంస్థ నుంచి ఈఎంఐ కోసం ఫోన్‌లు వస్తుండడంతో వాహనాన్ని తీసుకు వెళ్లినట్టు పూర్ణచంద్రరావు వారికి తెలిపారు. తమ వద్ద రికవరీ ఏజెంట్లు ఎవరూ లేరని ఫైనాన్స్ సంస్థ వారు చెప్పడంతో మోసపోయినట్టు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్‌ఐ ఎం. ఉమామహేశ్వరరావు తెలిపారు.

వస్త్ర దుకాణ మేనేజర్‌పై కేసు

తెనాలిరూరల్: ప్రముఖబ్రాండ్ వస్త్ర దుకాణ మేనేజర్‌పై కేసు నమోదంది. పోలీసుల కథనం మేరకు తెనాలి బోస్‌రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో ఓ ప్రముఖ బ్రాండ్ వస్త్రదుకాణం ఉంది. ఇందులో ఇటీవల ఆడిట్ జరుగగా సుమారు రూ. 70 వేల విలువైన వస్త్రాలు అమ్మకం జరిగినా నిధులు షోరూం ఖాతాలో జమకానట్టు తేలింది. మేనేజర్‌గా పని చేస్తున్న వ్యక్తి అవకతవకలకు పాల్పడినట్టు గుర్తింతించిన యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్‌ఐ ఎం. ఉమామహేశ్వరరావు బుధవారం రాత్రి తెలిపారు.

సేవా సారథులు.. సంక్షేమ వారధులు

తెనాలిరూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నూరుశాతం అందాలనే లక్ష్యంతో వలంటీర్ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. వీరి ద్వారా పథకాలను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందేలా చర్యలు చేపట్టారు. సీఎం ఆకాంక్షకు అనుగుణంగానే వలంటీర్లు చిత్తశుద్ధితో సేవలు అందిస్తున్నారు. ప్రజలకు ఏ అవసరమొచ్చినా తాము ఉన్నామని భరోసా ఇస్తున్నారు. వలంటీర్లు అందించిన సేవలను కొనియాడుతూ పలువురు లబ్ధిదారులు ఇలా ఆనందం వ్యక్తం చేశారు.

సమాచారంతో లబ్ధి చేకూరుతోంది...



ప్రభుత్వ పథకాలు, రాయితీలకు సంబంధించిన సమాచారాన్ని మా వలంటీర్ ఎప్పటికప్పుడు మా కుటుంబానికి వివరిస్తున్నారు. వాటి ద్వారా మాకు లబ్ధి చేకూరుస్తున్నారు. ఎప్పుడు ఏ పథకానికి దరఖాస్తు చేసుకోవాలో ఇంటికి వచ్చి చెబుతున్నారు. నాకు ప్రతి నెల 1వ తేదీన ఇంటికి వచ్చి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్నారు.

– కొల్లి సామ్రాజ్యం, కొత్తబొమ్మువానిపాలెం, కొల్లిపర మండలం పింఛన్ లబ్ధిదారు

వారి వల్లే పథకాలు అందుతున్నాయి..



గతంలో ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి సరిగా తెలిసేది కాదు వాస్తవానికి చాలా పథకాలకు అర్హులమైనా లబ్ధి పొందలేకపోయాం. వలంటీర్ వ్యవస్థ వచ్చాక ఆ సమస్య తీరింది. నాకు ఈబీసీ నేస్తం పథకం కింద ఏడాదికి రూ. 15 వేల ఆర్థిక సాయం అందుతోంది.

– ఆరిమండ ప్రమీల, కొల్లిపర మండలం, ఈబీసీ నేస్తం లబ్ధిదారు

వలంటీర్ల వల్ల పథకాలు తెలుస్తున్నాయి..



వలంటీర్ వ్యవస్థ వచ్చాక పథకాల గురించి తెలుస్తోంది. పథకానికి అర్హులో కాదో వారే గుర్తించి ఇంటికి వచ్చి మరీ దరఖాస్తు చేయిస్తున్నారు. నాకు అమ్మ ఒడి కింద లబ్ధి చేకూరుతోంది. నెలలో ఒకటి రెండు సార్లు కుటుంబసభ్యుల యోగక్షేమాలు కనుక్కోవడమే కాకుండ కొత్తగా అమలు చేస్తున్న పథకాల గురించి వలంటీర్ వివరిస్తున్నారు.

– పినపాటి దీప్తి మాధురి, అమ్మ ఒడి లబ్ధిదారు, మల్లెపాడు

పథకాలపై అవగాహన..



గతంలో ప్రభుత్వ పథకాలు ఎన్ని ఉన్నాయో మాకు తెలిసేది కావు. వలంటీర్ వ్యవస్థ వచ్చాక ప్రతి పథకం గురించి అవగాహన కల్పిస్తున్నారు. వలంటీర్‌ద్వారా వైఎస్సార్ చేయూత పథకం లబ్ధి పొందుతున్నాను. ప్రభుత్వ పథకాలు పేదలకు చేరవేయడంలో వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

– తాడిపర్తి మేరి, వైఎస్సార్ చేయూత లబ్ధిదారు

ఇంటి స్థలం మంజూరైంది..



గత ప్రభుత్వంలో ఇంటి స్థలం కోసం అనేక దరఖాస్తులు అందజేశాం. ఎన్నిసార్లు ఇచ్చినా నాయకులను కలిసినా ఫలితం లేకపోయింది. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక వలంటీర్‌మా ఇంటికి వచ్చి ఇంటి స్థలం కోసం దరఖాస్తు పూర్తి చేయించి తీసుకెళ్లారు. ఇంటి స్థలం మంజూరైంది. గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగే వాళ్లం. ఇప్పుడు వలంటీర్లు ఇంటికి వచ్చి సేవలు అందిస్తున్నారు.

– పినపాటి రాజేశ్వరి, నివేశన స్థలం లబ్ధిదారు

ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే శివకుమార్



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

చివలూరు(కొల్లిపర): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలను అందిస్తూ, రైతు శ్రేయస్సు కోసం రాష్ట్రంలో తొలిసారిగా డెల్టా ప్రాంతంలోని రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చిన ఘనత సీఎంకి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని చివలూరు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం రెండువ రోజు అధికారులు, నాయకులు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకూ వెళ్లి గత నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని, ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్ అందజేశారు. గ్రామస్తులు ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం జగన్ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రారంభించి ప్రజల దగ్గరికే ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారన్నారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం జగనన్నను మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలు మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్లు కావాలని అడిగారు ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడ ఎక్కడ సీసీ రోడ్డు అవసరాన్ని పరిశీలించి అధికారులు వెంటనే నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ బొంతు వేణుగోపాలరెడ్డి, బొంతు శ్రీలక్ష్మి, శిరిపురం సర్పంచ్ పచ్చవ సులోచన రాణి,పచ్చవ రమేష్, ఎంపీటీసీ కారుమంచి పృధ్వీకుమార్, మండల ఉపాధ్యక్షుడు బొల్లిముంత పోతురాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఆరిగ చంద్రారెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు కళ్ళం వెంకటప్పారెడ్డి, వివిధ గ్రామాల ఎంపీటీసీలు కె.శ్రీలత, మర్రెడ్డి మాధవి, వివిధ గ్రామాల పార్టీ ప్రధాన నాయకులు అవుతు నగేష్‌రెడ్డి,అవుతు పోతిరెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, పిల్లి గంగాధర్, మండ్రు రాజు, వివిధ గ్రామల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

వీనస్ థియేటర్..ఇకపై జ్ఞాపకం



వీనస్ థియేటర్ (ఫైల్)



వీనస్ థియేటరు కూల్చివేత

తెనాలి: వీనస్ థియేటర్...ఆంధ్రాప్యారిస్ తెనాలిలో శతదినోత్సవ, రజతోత్సవ సినిమాలతో ప్రేక్షకులను అలరించిన సినిమా థియేటర్. పట్టణ నడిబొడ్డులో ఉన్న ఈ థియేటరుకు ప్రేక్షకుల సందడి అంతా ఇంతా కాదు. ప్రేక్షకులు మెచ్చిన సినిమాలు మరికొన్ని రోజులు ఎక్కువ ఆడేది. ఒకమాదిరి సినిమాక్కూడా మినిమమ్ గ్యారెంటీ ఉండేది. రుచికరమైన టిఫిన్లకు చిరునామాగా నిలిచిన నవయుగ హోటల్ వీనస్ ఎదురుగానే ఉండేది. సినిమాకు ముందో వెనుకో ఆ హోటల్‌నూ ప్రేక్షకులు టచ్ చేసేవారు. ఇంతటి వైభవాన్ని చవిచూసిన ఆ థియేటరును ఇప్పుడు కూలిచ్చేస్తున్నారు. ఇక వీనస్ ఆవిర్భావం గురించి చెప్పాల్సి వస్తే 1961 నవంబరు 9న ప్రారంభమైంది. అయితానగర్‌కు చెందిన నన్నపనేని లింగారావు, తన బంధువులు, స్నేహితులైన వాసిరెడ్డి రాధాకృష్ణ ప్రసాద్, ముద్దన సుబ్బారావు, ఈదర వెంకటరత్తయ్యతో కలిసి సంకా వీరభద్రయ్యకు చెందిన స్థలాన్ని 1961లో లీజుకు తీసుకున్నారు. రికార్డు టైములో అంటే కేవలం 10 నెలల్లోనే వీనస్ థియేటర్‌ను నిర్మించారు. ఇందుకైన ఖర్చు దాదాపు రూ.3 లక్షలు. నాటి సినిమా హీరో అక్కినేని నాగేశ్వరరావును ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. అప్పటివరకు ఎలాంటి ప్రారంభోత్సవాలకు వెళ్లని నాగేశ్వరరావు ఎందుకో సంకోచించి, ఎవరైనా పెద్దవాళ్లను పిలవమని సూచించారు. దీనితో చల్లపల్లి రాజా సోదరుడైన సారథి స్టూడియోస్ అప్పటి అధినేత యార్లగడ్డ రామకృష్ణప్రసాద్‌చే థియేటరును ప్రారంభింపజేశారు. తొలి సినిమా రాజశ్రీ పిక్చర్స్ వారి అక్కినేని నాగేశ్వరరావు హీరోగా నటించిన ‘శభాష్‌రాజా’. దాదాపు 70 రోజులు ఆడింది. మూడో సినిమా జగపతి పిక్చర్స్ వారి ఆరాధన. అక్కినేని, సావిత్రి హీరోహీరోయిన్లు. ఈ సినిమా వీనస్‌లో వంద రోజులు ఆడింది. శతదినోత్సవ వేడుకలు ఇదే హాలులో నిర్వహించారు నిర్మాతలు. అక్కినేని, సావిత్రితో సహా పలువురు ప్రముఖులు విచ్చేశారు. ఎన్టీఆర్ కూడా రావాల్సి వుండగా, అనివార్య కారణాలతో రాలేదని లింగారావు కుమారుడు, ఎగ్జిబిటర్ ద్వారకానాథ్ గుర్తుచేసుకున్నారు. ఆ తర్వాత శ్రీకృష్ణార్జున యుద్ధం, వీరాభిమన్యు, తోడూనీడ వంటి సినిమాలెన్నో ఇక్కడ ప్రదర్శించారు. దాసరి నారాయణరావు దర్శకత్వంలో అక్కినేని, శ్రీదేవి, జయసుధ నటించిన ప్రేమాభిషేకం సినిమా 300 రోజులు ఆడింది. అదే ఈ థియేటర్ ఆల్‌టైమ్ రికార్డుగా చెబుతారు. తర్వాత థియేటరు స్థలం విషయంలో వివాదంతో దాదాపు పదేళ్లపాటు మూతపడింది. తిరిగి పునరుద్ధరణ జరిగాక వీరభద్రయ్య వారసులు సుబ్రహ్మణ్యం, తర్వాత సంకా శ్రీధర్, దత్తు థియేటరును నడిపారు. బృందావనం, సింహా, దూకుడు, బిజినెస్‌మేన్, అత్తారింటికి దారేది, రంగూన్‌రౌడీ, బంగారుబాబు, ఎన్‌కౌంటర్ సినిమాలు ఇదే థియేటరులో విజయవంతంగా ప్రదర్శించారు. నెంబర్‌వన్ సినిమా ప్రదర్శన సమయంలో ఆ సినిమాలో హీరోగా నటించిన సూపర్‌స్టార్ కృష్ణ థియేటరుకు వచ్చారు. ఇటీవల కొంతకాలంగా థియేటరులో ప్రదర్శనలు నిలిపివేశారు. చివరకు తొలగించారు. ఏదేమైనా వీనస్ థియేటర్‌లో సినిమా తెనాలి, పరిసరాల్లోనే వందలాది గ్రామాల్లోని నాటి ప్రేక్షకులకు ఒక మంచి జ్ఞాపకంగా మిగిలిపోనుంది. సినిమాలకు స్వర్ణయుగం నడిచిన కాలంలో ఇక్కడ ఒక వెలుగు వెలిగిన సినిమా థియేటర్లు రత్నా టాకీస్, వెంకటేశ్వర థియేటర్, సత్యనారాయణ టాకీస్, రాజ్యం థియేటర్, స్వరాజ్ థియేటర్ తరహాలోనే వీనస్ థియేటర్ స్థానంలో షాపింగ్ మాల్ లేదా మరో నిర్మాణమో రానుందని తెలిసింది.

శతదినోత్సవ సినిమాలెన్నో...



వీనస్ థియేటరును మా తండ్రిగారు, ఆయన స్నేహితులు, బంధువులు కలిసి నిర్మించారు. మధ్యలో చేతులు మారినా మొత్తంమీద ఆరు దశాబ్దాలపాటు ప్రేక్షకులకు చక్కని వినోదాన్ని పంచింది. ఎన్నో శతదినోత్సవ, రజతోత్సవ సినిమాలను ఇక్కడ ప్రదర్శించారు. అలాంటి థియేటరు ఇక లేదంటే విచారమే.

– నన్నపనేని ద్వారకానాథ్, ఎగ్జిబిటర్

వడ్డేశ్వరంలో శరవేగంగా రహదారుల నిర్మాణం



ఉండవల్లి లొద్దులో నిర్మిస్తున్న సీసీ రోడ్

తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరంలో రూ.40.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని బుధవారం చేపట్టారు. వడ్డేశ్వరం పరిధిలోని మీ సేవ కేంద్రం పక్కన వున్న రహదారి పెనుమాక ఆనంద కుమార్ ఇంటి వద్ద నుంచి ఎస్కే సుభాని ఇంటి వరకు 200 మీటర్ల పొడవున, 3 మీటర్ల వెడల్పున రూ.19.50 లక్షలు వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. వడ్డేశ్వరం రాధారంగా నగర్‌లో 180 మీటర్ల పొడవు, 4 మీటర్ల వెడల్పుతో రూ.21 లక్షల వ్యయంతో మరో సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. కార్పొరేషన్ స్పెషల్ గ్రాంట్ నుంచి ఈ నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా చిర్రావూరు జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.96 లక్షల నిధులను కేటాయించింది. ఈ నిధులతో ప్రస్తుతం పాఠశాలలో 2 అదనపు గదుల నిర్మాణం చేపట్టినట్లు డీఈ రెహమాన్ తెలిపారు. ఉండవల్లి లొద్దిలో అంగన్‌వాడీ స్కూల్ పక్కనే పి. గురవయ్య ఇంటి వద్ద నుంచి పి సీతమ్మ ఇంటి వరకు 180 మీటర్ల పొడవున, 3 మీటర్ల వెడల్పున కార్పొరేషన్ స్పెషల్ గ్రాంట్ నుంచి



వడ్డేశ్వరం మీ సేవ కేంద్రం వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్

రూ.15 లక్షలు కేటాయించి సీసీ రోడ్ నిర్మాణ పనులు చేపట్టినట్లు ఏఈ కిషోర్ తెలిపారు.

గ్రామ అభివృద్ధికే గ్రామ సచివాలయాలు ఏర్పాటు

ఎమ్మెల్యే శివకుమార్



చివలూరులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, ఎంపీపీ పద్మావతి

చివలూరు(కొల్లిపర): గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి జరుగుతుందని నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా ప్రతి గ్రామంలో ప్రజలకు చేరువగా, ఇంటి ముంగిటకే పాలన తీసుకురావాలని ఉద్దేశంతో గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని చివలూరు గ్రామంలో నూతనంగా రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం కార్యాలయం ప్రారంభోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలకు ఏపని కావాలన్నా మండల కేంద్రంలో ఉన్న రెవెన్యూ, మండల పరిషత్‌కు వ్యవప్రయాసాలతో వెళ్లాల్సి వచ్చేది ఇప్పుడు సచివాలయం తమ గ్రామంలో ఇంటి దగ్గరలో ఉండడం వల్ల ప్రజలు అంత దూరం పోకుండా తక్కువ సమయంతో ఎటువంటి సమస్యలైన గంటల వ్యవధిలో పూర్తిచేయడం జరుగుతుందన్నారు. సచివాలయాలు ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హత ఉన్న లబ్ధిదారులు సచివాలయాల్లో అర్జీ పెట్టుకున్న 72 గంటలోనే సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి సచివాలయాలను ప్రజలు సద్వియోగం చేసుకోవాలన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పరిపాలనలో గ్రామ సచివాలయం ద్వారా వివిధ సంక్షేమ పథకాలతో నేరుగా లబ్ధిదారుల ఖాతాలో రూ.9,92,39,400 జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ బొంతు వేణుగోపాలరెడ్డి,బొంతు శ్రీలక్ష్మి, ఎంపీటీసీ కారుమంచి పృధ్వీకుమార్, శిరిపురం సర్పంచ్ పచ్చవ సులోచనారాణి, పచవ రమేష్, మండల ఉపాధ్యక్షుడు బొల్లిముంత పోతురాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు కళ్ళం వెంకటప్పారెడ్డి, ,వివిధ గ్రామాల ఎంపీటీసీలు కె.శ్రీలత, మర్రెడ్డి మాధవి, వివిధ గ్రామాల పార్టీ ప్రధాన నాయకులు అవుతు నగేష్‌రెడ్డి,అవుతు పోతిరెడ్డి, వివిధ గ్రామల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

శేష భానురావుకు ఘన నివాళి

- తరలివచ్చిన నేతలు
- కడసారి వీడ్కోలు పలికిన సహచరులు



శేషభానురావుకు నివాళి అర్పించిన ఎమ్మెల్యే శివకుమార్, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి

తెనాలి: గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ జనరల్ మేనేజర్ పిన్నక శేషభానురావు (52) అంతిమయాత్రను బుధవారం ఘనంగా నిర్వహించారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం ఆయన అక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన భౌతికకాయాన్ని బుధవారం తెల్లవారుజామున తెనాలి కొత్తపేటలోని సరోజిని నాయుడు వీధిలోని నివాసానికి తీసుకొచ్చారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విచ్చేసి శేషభానురావు భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. చిన్నవయసులోనే ఆయన కన్నుమూయటం దురదృష్టకరమన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) ఉదయాన్నే వచ్చి శేషభాను రావుకు నివాళి అర్పించారు. సహకార రంగంలో ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. బ్యాంకు సీఈఓ కృష్ణవేణి, బ్యాంకు బ్రాంచిల మేనేజర్లు, యూనియన్ నాయకులు శేషభానురావుకు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే, జీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్లు ముమ్మనేని వెంకట సుబ్బయ్య, మారౌతు సీతారామయ్య, నల్లపాటి చంద్రశేఖర రావు కుమారుడు రవి, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తదితరులు భౌతికకాయాన్ని సందర్శించారు. నివాళులర్పించిన వారిలో పట్టణానికి చెందిన పలువురు కళాకారులు, కళాసంస్థల నిర్వాహకులు ఉన్నారు. అనంతరం బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు చేశారు.

తెనాలిలో పోస్టర్లు, ఫ్లెక్సీల ఏర్పాటు నిషేదం

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో అనుమతిలేని పోస్టర్లు, వాల్ పెయింటింగ్స్, ఫ్లెక్సీల ఏర్పాటును నిషేదించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి పట్టణ పరిధిలోని పబ్లిక్ బిల్డింగ్‌లు, ట్రాఫిక్ డివైడర్లు, ఓవర్ బ్రిడ్జి గోడలపై ఎక్కువ మంది పోస్టర్లు అంటిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ అనుమతులు లేకుండా అలా చేయకూడదని చెప్పారు. పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయదలచిన వారు తమను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

కర్ణాటకలో జైనముని హత్య అమానుషం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ



సబ్‌కలెక్టర్ కార్యాలయం అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ

తెనాలి: కాంగ్రెస్ పరిపాలిత రాష్ట్రంలో హిందువులపై దాడులు జరుగుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ ఆరోపించారు. ఆ రాష్ట్రంలో ప్రసిద్ధ జైనముని కామకుమార్ నంది మహారాజును ఇద్దరు కిడ్నాప్‌చేసి కరెంటుషాక్‌తో చంపి, శవాన్ని సమీప నదిలో పడేశారని ఆరోపిస్తూ, ఆ ఘటనను ఖండిస్తూ బుధవారం జైన్ సమాజం, హిందూ సంస్థలు, బీజేపీ నేతలతో కలిసి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గెలిచిన రోజు నుంచి పాకిస్తాన్ జెండాలు ఎగురవేయడం, హిందూ సమాజంపై దాడులు చేస్తామని బెదిరించడం జరుగుతోందన్నారు. మరో అడుగు ముందుకేసి జైనసాధువును హతమార్చారని, ఆశ్రమాన్ని తగలబెట్టారని చెప్పారు. నిందితులైన హసన్, మౌలీలను కఠినంగా శిక్షించాలనీ, ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రకాష్‌జైన్, కుశల్‌రాజ్ జైన్, రమేష్ జైన్, మైలా హరికృష్ణ, తమిరిశ అనంతాచార్యులు, అన్నవరపు వేణుగోపాల్, మంచాల రత్నరాజు, బోడపాటి ఆదిత్య, అంబటి మారుతీరామ్, దొడ్డ జార్జి, ఆర్ఎస్ఎస్, భజరంగదళ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు డాక్టర్ బీసీ రాయ్



వైద్యులు, వైద్య సిబ్బందిని ఘనంగా సన్మానించిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

తాడేపల్లిరూరల్: స్వాతంత్య్ర సమర యోధుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బి.సి.రాయ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం దుగ్గిరాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.సి.రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దుగ్గిరాల జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎ.సిద్ధయ్య నాయుడు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామిలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ బీసీ రాయ్ సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం భారతరత్న వంటి అత్యున్నత పురస్కారం ఇవ్వడంతో పాటు ఆయన పేరున జాతీయ పురస్కారాలు (రాజకీయ, సైన్స్, కళలు, సాహిత్యం మొదలైన రంగాలలో విశేష సేవలందించిన వారికి) ఇవ్వడంతో పాటు ఆయన జన్మదినమైన జూలై 1వ తేదీని జాతీయ వైద్యుల దినంగా ప్రకటించి అమలు చేస్తోందని అన్నారు. అనంతరం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు డాక్టర్ మహమ్మద్ ఇజాజ్ అబ్దుల్ రెహమాన్, డాక్టర్ సి.ఇందిరలను జ్ఞాపిక, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు నర్సులకు ఫ్లోరెన్స్ నైటింగేల్ పురస్కారాలను అందజేశారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నల్లనూకల వెంకటేశ్వరరావు, షేక్ సుభాని, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.